క్లుప్తంగా

16న భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు



పెదకూరపాడు: అమరవీరుల శత వార్షికోత్సవంలో భాగంగా పెదకూరపాడులో ఈ నెల 16న వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు, పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పెదకూరపాడు శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు యోధులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాధకులు, పాఠశాల నిర్మాణ సారథి, మాజీ శాసనసభ్యులు, మాజీ సర్పంచ్ దర్శి లక్ష్మయ్య, కమ్యూనిస్టు పార్టీ నాయకులు దర్శి పానకాలరావు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అంబటి హనుమంతరావు పెదకూరపాడు నియోజవర్గంలో సీపీఐ బలోపేతానికి, బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. స్మారక స్థూపాలకు మరమ్మతులు చేసి రంగులు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి కమ్యూనిస్టు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలోని మసీదులన్నీ కిటకిటలాడాయి. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షాపరులతో పాటు ప్రత్యేకంగా నమాజులో పాల్గొనేందుకు వచ్చిన ముస్లిం సోదరులతో మసీదులు కిక్కిరిశాయి. గుండ్లపల్లి, నకరికల్లు, చాగల్లు, చేజర్ల, కుంకలగుంట, చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాల్లోని మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజును జరుపుకున్నారు. రంజాన్ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో తొలి శుక్రవారం ప్రార్థనలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటిస్తే అల్లాహ్ ప్రసన్నం పొంది పరలోక ప్రాప్తి సిద్ధిస్తుందని అన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం దువా చేశారు.

అర్బన్ సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ప్రదీప్



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి అర్బన్ సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ 2025–27 సంవత్సరానికి నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా చిలుకా ప్రదీప్ ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎన్జీవో హోం కార్యాలయంలో గురువారం జరిగిన ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. పట్టణంలో మొత్తం 15 అర్బన్ సచివాలయాలు ఉండగా 133 మంది ఓటర్లు ఉన్నారు. 121 ఓట్లు పోలయ్యాయి. రెండు ఓట్లు చెల్లలేదు. వీటిలో చిలుకా ప్రదీప్‌కు 45 ఓట్లు, ఐ.దేవేంద్రకు 42 ఓట్లు, ఎస్.శ్రీనివాసరావుకు 31 ఓట్లు, ఏలూరు వంశీ సాయికి ఒక ఓటు వచ్చాయి. మూడు ఓట్ల మెజార్టీతో చిలుకా ప్రదీప్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం నూతన ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా చిలుకా ప్రదీప్‌కు మున్సిపల్ మేనేజర్ నెట్టెం సాంబశివరావు, ఏపీ ఎన్జీవో సత్తెనపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు, కార్యదర్శి అంబేడ్కర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపి సత్కరించారు.

కొనసాగుతున్న శతచండీ మహా యాగం



సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో ఈ నెల 15 వరకు శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మా, దేవి ఉపాసకులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో జరిగే పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురువందనం, ప్రధాన దేవతార్చన, శతచండీ హోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే మహాలక్ష్మి, శ్రీ సూక్త, నవదుర్గ హోమాలు, చతుర్వేద సేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆస్థాన పురోహితులు కలవకొలను సీతారామ శాస్త్రి నిర్వహించారు. గణేష్ యువసేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా వారి కంటే మిన్నగా మహిళలు అన్ని రంగాలలో తమదైన శైలిలో రాణిస్తున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని పలు కార్యాలయాలు స్కూళ్లలో మహిళా ఉద్యోగులను శుక్రవారం సత్కరించారు.

- పలు చోట్ల మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానాలు
- మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత



సత్కారం అందుకున్న మహిళలతో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తదితరులు

సత్తెనపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సత్తెనపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మండల విద్యాశాఖ అధికారి–1 ఎ.శ్రీనివాసరావు, సీడీపీఓ టి.శ్రీలత, ఏసీడీపీఓ సంతోషకుమారి, సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, ఆషా, తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా బెస్ట్ అంగన్‌వాడీ వర్కర్స్ సుజాత (నందిగామ), మహాలక్ష్మి(బట్లూరు), శ్యామల (బృగుబండ), జి.పావని(మహిళాపోలీస్ కొమెరపూడి), కోటి రత్నం (ఏఎస్ఎం పణిదం)లను పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ముప్పాళ్ళ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీలత, తహసీల్దార్ భవానిశంకర్, ఏసీడీపీఓ సంతోషకుమారిలు పాల్గొని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళల హక్కులు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఈఓపీఆర్డీ రూపవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.అనంతలక్ష్మి, జి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉత్సాహంగా ఆటల పోటీలు

పెదకూరపాడు: మహిళా దినోత్సవం పురస్కరించుకొని పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. లెమన్ అండ్ స్పూను, హౌసి, మ్యూజికల్ చైర్స్, డిబేట్, మ్యూజికల్ బాల్ వంటి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.విద్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా, ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా అధికారులు తహసీల్దార్ ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మున్ని, మండల వ్యవసాయ అధికారి శాంతి, వైద్యాధికారి విద్యలను సహచర ఉద్యోగులు సత్కరించారు.

విద్యతోనే మహిళలకు గుర్తింపు

బెల్లంకొండ: ప్రతి మహిళ చదువుకుని, అన్ని రంగాలలో ప్రతిభ కనబరిస్తే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి బి.రాజకుమారి తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అత్యుత్తమ స్థాయిలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ నుంచి లోక్ సభ స్పీకర్ వరకూ మహిళలు అన్ని బాధ్యతలు చేపడుతున్నారని గుర్తు చేశారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బలరామ్ నాయక్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అల్లాబీ, అరుణకుమారి, స్వాతి, ఫర్జానా, ఎస్ఎంసీ చైర్మన్ దీపాల కోటేశ్వరరావు, నాయకులు మేకం శ్రీరామమూర్తి, యల్లమందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నందిగామలో మహిళా దినోత్సవం

సత్తెనపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మండల స్థాయిలో సత్తెనపల్లి మండలం నందిగామలో శనివారం జరుగుతాయని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో నందిగామ గ్రామ పంచాయతీ మహిళ స్నేహిత గ్రామంగా ఎంపికైనందున మండల స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆ గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరూ మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాలు జారీ చేశారన్నారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న మహిళా ఉద్యోగులు, ఏఈపీఆర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ హౌసింగ్, ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్, వెటర్నరీ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అలాగే ఇతర డిపార్ట్‌మెంట్ల పరిధిలోని మహిళా ఉద్యోగులు నందిగామలో శనివారం ఉదయం 9 గంటలకు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.



ముప్పాళ్ళలో మహిళలకు సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్ భవానిశంకర్, సీడీపీఓ శ్రీలత

క్రోసూరులో మహిళా దినోత్సవ వేడుకలు

క్రోసూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని క్రోసూరు జెడ్పీ పాఠశాల, అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం రామాంజనేయులు అధ్యక్షత వహించగా ఎంపీడీవో జి.శ్రీనివాస్, ఎంఈవో ఏకుల ప్రసాదరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ఆవశ్యకత గురించి వారు మాట్లాడారు. మహిళలను సమాజంలో పురుషులతోపాటు సమానంగా చూడాల్సిన అవసరం ఉందని, మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు బి.తులసీ సౌజన్య, కె.పద్మావతి, చందన హారతి, శారద, ఎ.నాగజ్యోత్స్నదేవి, కె.ఎస్తేరు, బి.వీల, కె.సుఖవేణి, లక్ష్మీకుమారి, టి.సామ్రాజ్యం, సీహెచ్ఎస్ సుజాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, బాబురావు, సురేష్, శ్రీనాద్, శేషగిరిరావు, హరిదాసు, హరిప్రసాద్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

అందుకూరు ఎంపీయూపీ పాఠశాలలో... స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంభా లక్ష్మిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా పాఠశాల హెచ్ఎం తిరుమల రెడ్డి సతీమణి ముత్యాలమాధవి పాఠశాలకు రూ.20 వేలు ఖరీదు చేసే సౌండ్ బాక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్, పాఠశాల ఉపాధ్యాయులు గోవిందరెడ్డి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోను, మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది



వ్యవసాయ శాఖ అధికారి శాంతిని సత్కరిస్తున్న తహసీల్దార్ ధనలక్ష్మి



క్రోసూరు జెడ్పీ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం



అందుకూరు పాఠశాలలో సౌండ్‌బాక్స్ అందచేసిన సందర్భంగా ఎంఈవో, ఉపాధ్యాయులు

పీ 4 సర్వేకి ప్రజల సహకారం అవసరం

సత్తెనపల్లి: పీ 4 సర్వేకి ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పీ 4 సర్వేపై సచివాలయ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీ 4 సర్వే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా పేదల ఇంటింటి అభివృద్ధి నిమిత్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ఈ నెల 8 నుంచి 18వ తేదీ లోపు అతి నిరుపేదలుగా ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి గ్రామ సభల ద్వారా ఆమోదించి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపడం జరుగుతుందన్నారు. ఈ సర్వే పూర్తి చేయడానికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్డీ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ శివబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అత్యంత పేదలను గుర్తించేందుకే పీ 4 సర్వే

సత్తెనపల్లి: అత్యంత పేదలను గుర్తించేందుకే పీ 4 సర్వే నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో శుక్రవారం వార్డు సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పీ 4 సర్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ నెల 30 నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా సర్వే ఎలా చేపట్టాలి? అనే దానిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, వార్డు సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆర్థిక స్థితిగతులను నమోదు చేయాలి

రాజుపాలెం: ఇంటి ఆర్థిక స్థితి గతులను సర్వే సభ్యులు కచ్చితంగా సర్వే చేయాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్)పై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో ఎంపీడీవో మాట్లాడుతూ సర్వే సభ్యులు ఇంటి ఆర్థిక స్థితిగతులపై సర్వే చేసేటప్పుడు వారి ఇళ్లు పూరిగుడిసె, రేకుల ఇల్లా, డాబానా, వ్యవసాయ భూమిని కలిగి ఉన్నారా.. కలిగి ఉంటే ఎంత, పింఛన్ పొందుతున్నారా, ఇంటి అద్దె ఆదాయం పొందుతున్నారా, కూలి పనికి వెళుతున్నారా, వలసలు వెళ్లారా ఇలాంటి డేటాలు మీకు ఇచ్చిన ఫారంపై తూచా తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆర్ఐ తదితరులు ఉన్నారు.

రీసర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శుక్రవారం పరిశీలించారు. సర్వే ప్రక్రియలో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. రైతులకు ముందస్తు సమాచారం అందించిన తర్వాత, వారి సమక్షంలోనే సర్వే పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నార్నెపాడులో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్

మద్యం మత్తులో దాడి.. ఒకరికి గాయాలు

బెల్లంకొండ: మద్యం తాగుతున్న సమయంలో వివాదం రావడంతో మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని మాచాయపాలెం వైన్స్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఈ దాడిలో ఓ వ్యక్తికి మెడపై తీవ్ర గాయం అయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాచాయపాలెం గ్రామానికి కొండెబోయిన చిరంజీవి, అదే గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు వైన్స్ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన రూమ్‌లో మద్యం తాగుతున్నారు. కాగా వ్యక్తిగత కారణాల వల్ల వీరి మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చిరంజీవిపై బీరు సీసాతో దాడి చేయగా, చిరంజీవికి మెడపై గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు చిరంజీవిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బాధితుడిని గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు పూర్తి వివరాలు సేకరించి, కేసు నమోదు చేస్తామని స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపారు.



చిరంజీవి

అన్ని రకాల గ్రేడ్‌ల పొగాకును కొనుగోలు చేయాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ



సత్తెనపల్లి: అన్ని రకాల గ్రేడ్ల పొగాకును కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తెనపల్లి మండలంలోని వెన్నాదేవిలో జరుగుతున్న పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయనతో పాటు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు పరిశీలించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం అన్ని రకాల పొగాకును క్వింటా రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేసిన సందర్భంగా రైతులు ఈ సంవత్సరం పొగాకు సాగు చేయడం జరిగిందన్నారు. 88 తాళ్లూరుకు చెందిన అప్పారావు అనే రైతు రెండు ఎకరాల పంట వేశాడని, ప్రస్తుతం 9.5 క్వింటాళ్ల మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాడన్నారు. పొగాకు చెక్కులను రూ.14,500 నుండి రూ.6,000 కి కొనుగోలు చేశారన్నారు. అందులో 1.25 క్వింటాళ్ల పొగాకు చెక్కులను పచ్చ ఆకు ఉందని తిరస్కరించారన్నారు. 8.25 క్వింటాళ్లకు ఆ రైతుకు పడిన ధర సగటున రూ.12,172 మాత్రమేనని, క్వింటాకి రూ.3 వేల చొప్పున రూ.25 వేలు ఆ రైతు నష్టపోయాడన్నారు. తిరస్కరించిన పొగాకు చెక్కులను గ్రేడ్ చేయించినా, గ్రేడింగ్ అయిన ఖర్చులు కూడా రావని రైతు వాపోతున్నాడన్నారు. గత సంవత్సరం రూ.15 వేలకు కొనుగోలు చేసిన పొగాకును ప్రస్తుతం రూ.6 వేలకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు.

- తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు సాగు చేసిన రైతు పొగాకు షెడ్డు వేసుకున్నందుకు రూ.28 వేల వరకు సబ్సిడీ ఇచ్చే వారని, పొగాకు చెక్కులు తొక్కేందుకు చెక్కపెట్టకు కూడా సబ్సిడీ ఇచ్చే వారని, ఈ సంవత్సరం నామమాత్రంగా షెడ్డుకు రూ.10 వేలు మాత్రమే ఇస్తానంటున్నారన్నారు. మరో పక్క నల్ల బర్లి పొగాకు క్వింటా రూ.6 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీసం ఒక క్వింట పొగాకు తయారు చేసి కంపెనీకి తీసుకువెళ్లడానికి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. దీని వలన ఎకరానికి రూ.50 వేల వరకు రైతులు నష్టపోతున్నారన్నారు. పొగాకు బోర్డు జోక్యం చేసుకొని ధర పడిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని పొగాకు, మిర్చి పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న గుంటూరు చుట్టుగుంటలోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే రైతుల ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గనాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్

గుడిపాడు(క్రోసూరు): వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శుక్రవారం మండలంలోని గుడిపాడు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని, గొడుగు వాడితే మంచిదన్నారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు అధికంగా తీసుకోవాలన్నారు. తేలికపాటి ఆహారం తీసుకోవాన్నారు. అధికంగా మంచినీళ్లు తాగాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన వారి శరీరం చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో తుడుస్తూ శరీర ఉష్ణోగ్రత స్థాయిని గమనిస్తూ ఉండాలన్నారు. పరీక్షల సమయం కావడంతో ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. దోమల వ్యాప్తి, నీటి కాలుష్యం కారణంగా ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరు కలుషితమైనట్లు గుర్తిస్తే పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. నీళ్ల విరేచనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణం చేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఝాన్సీ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

నేటి నుంచి 12వ తేదీ వరకు ఆంజనేయస్వామి ఉత్సవాలు

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి 96వ జయంతి ఉత్సవాలకు దేవాలయం ముస్తాబు అయ్యింది. నేటి నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధం చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. 9వ తేదీ శనివారం స్వామి వారికి సుప్రభాత సేవ, అష్టోత్తర శతనామపూజలు జరుగును. సామూహిక లక్షతమలపాకుల, సింధూర పూజలు జరుగును. అనంతరం శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి కళ్యాణ మహోత్సవం రంగరంగ వైభవంగా జరుగును. 9 నుంచి 12వ తేదీ వరకు జాతీయ స్థాయి ఎడ్ల పందేలు జరుగును.

300 పశువులకు వ్యాక్సిన్లు



క్రోసూరు: జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పీసపాడు, దొడ్లేరు, ఊటుకూరు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 300 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు, బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్లు వేసినట్లు డాక్టర్ మల్లయ్య తెలిపారు. పశు పోషకులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బలుసుపాడు, పరస, కాశిపాడు, కంభంపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట మండల పరిధిలో రెండవ శనివారాన్ని పురస్కరించుకొని విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ శివరామకోటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నకరికల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ షేక్ గౌస్ శుక్రవారం తెలిపారు. నకరికల్లు మండల పరిధిలోని గుండ్లపల్లి, చేజర్ల, కండ్లకుంట, చల్లగుండ్ల, నకరికల్లు తదితర విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతుల అనంతరం పునరుద్ధరిస్తామని అన్నారు. అలాగే త్రీఫేస్ విద్యుత్ సరఫరాను శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు ఇస్తామన్నారు.

బెల్లంకొండ: నేడు రెండవ శనివారం సందర్భంగా బెల్లంకొండ, పాపాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్లు ఏఈ పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా మండలానికి వచ్చే 33 కేవీ, 11కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు 142 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: పట్టణంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 142 మంది విద్యార్థులు శుక్రవారం గైర్హాజరయ్యారు. పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం–2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలకు సంబంధించి జనరల్ విభాగంలో 1,190 మంది హాజరు కావలసి ఉండగా 1,072 మంది హాజరు కాగా 118 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 207 మంది హాజరు కావలసి ఉండగా 183 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు.

